RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 219

ఆదివారం
జులై 27, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00

## భర్తకు విషం పెట్టి చంపిన భార్య

**లక్నో, వేదన్యూస్ :**

ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా ఉలావ్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్య, ఆమె ప్రియుడు విషం ఇవ్వడంతో సునీల్ అనే వ్యక్తి మరణించాడు. తన కోడలు, అదే గ్రామానికి చెందిన ఓ పురుషుడు తన కుమారుడికి విషం ఇచ్చి చంపారని సునీల్ తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు జూలై 24న కేసు నమోదు చేసినట్లు ఫిరోజాబాద్ నగర ఎస్పీ రవి శంకర్ ప్రసాద్ తెలిపారు.సునీల్ భార్య, ఆమె ప్రియుడిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు ఆయన చెప్పారు. తన భార్యకు, మరో వ్యక్తికి వివాహేతర సంబంధం ఉన్నట్లు సునీల్‌కి తెలిసిందని, దీంతో ఆహారంలో విషం కలిపి వారిద్దరూ సునీల్‌ని హతమార్చారని ఎస్పీ తెలిపారు.



# ఉచితాలు సముచితమేనా!

- ఉచితాల మత్తు..
  ప్రజాస్వామ్య భవితవ్యానికి ముప్పు!
- సంక్షేమం, అభివృద్ధి కావాలి
- రాజకీయ పార్టీల స్వప్రయోజనాల కోసం పెట్టే ఫ్రీ బీ స్కీములు కాదు
- సామాజిక విశ్లేషకులు అజయ్ కుమార్

**వేద న్యూస్, వరంగల్:**

"ఉచితాల కారణంగా జనం పని చేయడానికి సుముఖత చూపడం లేదనీ, వారు ఉచిత రేషన్లు పొందుతున్నారనీ, వారు ఏ పనీ చేయకుండానే నగదు అందుకుంటున్నారు అని " దేశ అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ఓ పిటీషన్ విచారణ సందర్భంగా తన అభిప్రాయాన్ని వెల్లడించింది. నిజానికి ఉచితాలు ప్రజలను సోమరులుగా మారుస్థాయని, కాబట్టి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని, అందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కొందరు మేధావులు కోరుతున్నారు. కానీ, ఆ దిశగా ప్రభుత్వాల ఆలోచన ఉండటం లేదని ప్రభుత్వాల వైఖరిని గమనిస్తే స్పష్టమవుతుంది.

**మోయలేని భారంగా హామీలు!**

ఎన్నికల సమయంలో పార్టీలు వినిపించే ప్రధాన నినాదం ఉచిత పథకాలు, ఓటర్లు కూడా ఏ పార్టీ ఏ ఉచిత పథకాలు ఇస్తుంది అనే ధోరణిలోనే ఉన్నాయి. ఉచితాల జాబితా రోజురోజుకూ పెరుగుతున్నది. చివరికి ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మోయలేని భారంగా మారుతోంది! సుప్రీం కోర్ట్ కూడా ఎన్నికలకు ముందు ఉచితాలను ప్రకటించే పద్ధతిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది, వీటి వలన ప్రజలు పని చేయడానికి ఇష్టపడటం లేదని కోర్టు పేర్కొంది. ప్రభుత్వం ప్రజలకు ఉపాధి మార్గాలు చూపి,సంక్షేమాన్ని అందించి దేశాభివృద్ధికి దోహదపడేలా ప్రేరేపించాలని పేర్కొంది. ప్రజలకు మంచి సౌకర్యాలు అందించాలనే ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే.. కానీ వారిని సమాజాభివృద్ధిలో భాగం చేసే విధంగా అవి ఉండాలని న్యాయస్థానం అభిప్రాయపడింది. కాగా, ప్రజాస్వామ్యంలో ఉచితాలు అభివృద్ధికి అడ్డుగోడ అవుతాయని సామాజిక విశ్లేషకులు జి. అజయ్ కుమార్ పేర్కొంటున్నారు. పేదలకు ఆహారం, ఆరోగ్యం, విద్య లాంటి మౌలిక హక్కులు సక్రమంగా అందేలా చేసే కార్యక్రమాలు అవసరమేనని చెప్పారు. ఉదాహరణకు..జాతీయ ఆహార భద్రత, మధ్యాహ్న భోజన పథకం,రైతు భరోసా,వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్‌లు,విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇలాంటివి అవసరమైన వారికి సమర్థవంతంగా అందితే అది సంక్షేమం. కానీ..ఇప్పుడు రాజకీయ పార్టీలు "ఓటు కొనే పథకాలు" గా ఉచితాలను వాడుతున్నాయనీ, ఉచిత హామీలతో ఓటర్లను ఆకర్షించి గెలవాలనే అధికారం చేపట్టాలనే ధోరణి పెరుగుతోందనీ వివరించారు. ఫ్రీ బీస్ వల్ల జరిగే నష్టాలపై అజయ్ కుమార్ స్పష్టంగా విపులీకరించారు ఆ వివరాలు ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

**ఖజానా ఖాళీ!**

ఈ రాజకీయ ఉచితాల వల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది. వివిధ రాష్ట్రాల్లో జీతాలు ఇవ్వలేని పరిస్థితి, అభివృద్ధి పనుల నిలిపివేత, అప్పుల పెరుగుదల వంటివి జరుగుతున్నాయి ఇవన్నీ ఉచితాల ఫలితాలు. రూ.కోట్లకు పైగా అప్పు ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ నివేదిక తెలిపింది. ఇవి రాష్ట్రాలు దివాళా తీయడానికి అప్పుల పాలు కావడానికి కారణం అవుతున్నాయి. ఈ అప్పు చివరికి పన్నుల రూపంలో ప్రజలపైనే భారం అవుతోంది.

**ఆర్థిక భారం**

ప్రభుత్వ ఆదాయాల్లో ఎక్కువ భాగం ఉచిత పథకాలకే వెళ్తోంది. అభివృద్ధి, మౌలిక వసతులపై పెట్టుబడి తగ్గిపోతోంది. "ఏమీ చేయకుండానే డబ్బు వస్తుంది" అనే భావన పని చేసే తత్వాన్ని దెబ్బతీస్తోంది. ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోతున్నారు. విమర్శించే స్వేచ్ఛను కోల్పోతున్నారు. ఉచిత పథకాలు కొంత మంది రాజకీయ నాయకులకు డబ్బును సంపాదించిపెట్టే దారులుగా మారుతున్నాయి. ఈ పథకాలు అర్హులకు చేరేదేమో గానీ దాని తాలూకు ఫలాలు మాత్రం అవినీతితో కూడిన ఎంతో మంది రాజకీయ నాయకులను ధనవంతులుగా మారుతున్నాయి.ఈ రోజు నాయకులు చేసే ఖర్చులు, రేపటి తరాలు చెల్లించాల్సిన పన్నులుగా మారుతున్నాయి. అవసరమున్న వారికి అర్హులకు కాకుండా – అన్ని వర్గాలకు ఉచితాలు ఇవ్వడం వల్ల అసలైన లబ్ధిదారులకు ఈ పథకాలు అందకుండాపోతున్నాయి , ప్రభుత్వాల పై ఆర్థిక భారం పెరుగుతుంది.

**సంక్షేమం అంటే ఏమిటి?**

నగదు, డబ్బులు ఇవ్వడం కాదు..ఉపాధి అవకాశాలు, మిగతా 4వ పేజీలో..

# అనుమతి లేని దవాఖాన సీజ్

**వేద న్యూస్, హన్మకొండ :**




అర్హత లేకుండా ఎలాంటి అనుమతులు లేకుండా మడికొండలో ప్రథమ చికిత్స కేంద్రం పేరుతో దవాఖాన, లేబరేటరీ నిర్వహిస్తున్న శ్రీ సాయి శ్రీ ప్రథమ చికిత్స కేంద్రాన్ని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య నోటీసులు అందించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు మరియు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం అనుమతులు లేకుండా క్లినిక్ గాని ఆసుపత్రి గాని లేబరేటరీ గాని నిర్వహించకూడదని అన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, ప్రథమ చికిత్స పేరుతో అర్హతకు మించిన వైద్యం చేయకూడదన్నారు.సీజనల్ వ్యాధులకు సంబంధించి యాంటీబయాటిక్ లు వినియోగిస్తూ చికిత్స అందిస్తున్నట్లయితే వారిపై తగు చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు.జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని క్లినిక్లు ఆసుపత్రులను తనిఖీ చేయడం జరుగుతుందని , రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్లినికల్ గాని ఆసుపత్రులు గాని నియమ నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్నారా లేదా రెన్యువల్ చేయించుకున్నారా లేదా పొల్యూషన్ ,బయోమెడికల్ మరియు ఫైర్ కు సంబంధించిన అనుమతులు ఉన్నాయా లేదా వారు అందిస్తున్న సేవలకు సంబంధించిన ధరల పట్టిక ప్రదర్శించడం జరిగిందా లేదా అనుమతి పొందిన డాక్టర్లు పనిచేస్తున్నారా లేదా ఇతర అంశాలను చెక్ చేయడం జరుగుతుందన్నారు. అనుమతులేని క్లినిక్లు గాని ఆసుపత్రులు గాని ఉన్నట్లయితే వారంలోగా వారు రిజిస్ట్రేషన్ చేసుకొనట్లయితే చట్టం నియమాల ప్రకారం వారిపై చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ సీజన్లో డెంగ్యూ జ్వరమని ,ప్లేట్ లెట్స్ తగ్గాయని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయకుండా వారికి అవసరమైన చికిత్సను అందించాలన్నారు.ఈ తనిఖీల్లో మడికొండ ఎం ఎల్ హెచ్ పి డాక్టర్. ఓం ప్రకాష్, స్టాటిస్టికల్ ఆఫీసర్ జి ప్రసన్నకుమార్, హెల్త్ సూపర్వైజర్ విప్లవ కుమార్ పాల్గొన్నారు.




# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**వేద న్యూస్, శాయంపేట :**

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్ట్ చేశారు . ఈ ఘటన శాయంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం తన సిబ్బందతో శాయంపేట గ్రామం నందు పెట్రోలింగ్ చేస్తుండగా శాయంపేట గ్రామంలోని గట్ల మహిపాల్ రెడ్డి ఇంటి లోపల పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రాగ ఎస్సై తన సిబ్బందితో అక్కడికి వెళ్లగా అక్కడ చింతల భాస్కర్ ,భోగం సాంబరాజు , ఎండి సాదిక్ , ధైనంపల్లి సుమన్, కూతాటి రీనాకర్ , ధైనంపల్లి సుమన్, ఎడ్డే రవీందర్ , రాయరకుల సుమన్ ,పిట్టల వికాస్ లు పేకాట తీన్ పత్త ఆడుతూ కనిపించడంతో వారిని ఎస్ఐ తన సిబ్బందితో పట్టుకొనుటకు ప్రయత్నించగా అందులో ముగ్గురు చింతల భాస్కర్, భోగం సాంబరాజు, ఎండి సాదిక్ దొరికినారు. మిగతా ఆరుగురు ధైనంపల్లి సుమన్ ,కూతాటి రీనాకర్ , ధైనంపల్లి సుమన్ , ఎడ్డే రవీందర్ ,రాయరకుల సుమన్, పిట్టల వికాస్‌లు తప్పించుకొని పారిపోయినారు. ఘటనా స్థలంలో 52 పేక ముక్కలు ,మూడు సెల్ ఫోన్లు, రూ. 8660 నగదును స్వాధీనం చేసుకొని 9 మంది, ఇంటి యజమాని పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపారు.



# కొండెక్కిన బంగారం ధరలు

**హైదరాబాద్, వేదన్యూస్ :**

కొండెక్కిన బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా డిమాండ్ పడిపోవడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేయడంతో దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. వరుసగా మూడోరోజూ శనివారం కూడా బంగారం ధరలు భారీగా తగ్గాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పద్రిగాముల పుత్తడి ధర రూ.550 తగ్గి లక్ష రూపాయల దిగువకు రూ.99,930కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1,00,480గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 22 క్యారెట్ బంగారం తులం ధర రూ.400 దిగొచ్చి రూ.91,600గా నమోదైంది. బంగారంతోపాటు వెండి భారీగా తగ్గింది. పారిశ్రామిక వర్గాల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.2 వేలు తగ్గి రూ.1.26 లక్షలకు దిగొచ్చింది.

# ఆలోచనే ఆయుధం

- సొసైటీ ఫస్ట్ లీడర్ "ఇల్లాలు"
- రాష్టానికి కొత్త నాయకత్వం తెలంగాణ జాగృతి నుంచి..
- "లీడర్" రాజకీయ శిక్షణ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**




తెలంగాణ జాగృతి సంస్థ తెలంగాణలో చురుకైన నాయకత్వాన్ని తీర్చిదిద్దుతుందని, తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాల నుకుంటున్నామని జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "లీడర్" పేరిట నిర్వహించిన రాజకీయ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేశారు. కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని, ఎప్పుడు కూడా కొత్తగా, నవీనంగా ఉంటేనే సంస్థలు బ్రతుకుతాయని వివరించారు. లీడర్ అంటే కేవలం సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం మాత్రమే కాదని, ఈ సమాజంలో తొలి లీడర్ ఇంట్లో ఇల్లాలు అని తెలిపారు. "లీడర్ అంటే ఎవరో ఆకాశం నుంచి ఊడిపడరు. తల్లి గర్భంలో నుంచి ఎవరూ కూడా నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడు అవుతాడు తప్పా మూస పద్దతిలో కొనసాగేవాడు నాయకుడు కాడు" అని వ్యాఖ్యానించారు. తోటివారి గోప్యతను, మర్యాదను కాపాడకుండా ఏది పడితే అది మాట్లాడడం ట్రెండ్ గా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు యూట్యూబర్ల అండ కూడా బాగా ఉందని, ఎవరెక్కువ తిడితే వారికి అన్ని వ్యూస్ ఎక్కువ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి నాయకులు తిట్టకుండా పదునైన విమర్శ చేయడం నేర్చుకోండని సూచించారు. తిట్లకు దిగజారామంటే విషయం లేదని అర్థమని, పక్కోడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థమని పేర్కొన్నారు. "మహాత్మా గాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యే, ఎంపీగా లేరు.. కానీ ఇవాళటికీ అందరం గాంధీని గుర్తు చేసుకుంటామని చెప్పారు. తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరికి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉంది. శత్రువు ఒక చెంపపై కొడితే మరో చెంపుచూపించమని గాంధీ అంటారనీ ,కానీ మనం శత్రువు దెబ్బ కొట్టకుండా చూసుకోవాలి., మన ఆలోచనే ఆయుధం కావాలి" అని వ్యాఖ్యానించారు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11వ స్థానంలో ఉందని ఒక సర్వేలో తేలిందని ప్రస్తావించారు. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతి కూడా మనుగడ సాధించలేదని, సాంస్కృతిక.. మిగతా 4వ పేజీలో..

# విద్య ద్వారానే పేదరిక నిర్మూలన

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**వేద న్యూస్, ఇల్లంతకుంట ప్రతినిధి:**



ఇల్లంతకుంట మండలం రహింఖాన్ పేట గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు.మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే మ్యాథ్స్, తెలుగు, అకౌంటింగ్ ఇంగ్లీష్ పాఠాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి నుండి సమాధానాలు రాబట్టారు.కిచెన్ షెడ్డు ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం రుచిగా వండి వడ్డించాలని తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఏ జిల్లాలో లేనివిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టర్ చొరువతో ప్రత్యేకంగా ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న బీసి రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ను ఫోన్ ద్వారా అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,విద్య ద్వారా మాత్రమే పేదరికం తగ్గిపోతుందని బలంగా విశ్వసిస్తూ పేదలు అధికంగా ఉండే ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు కూడా అందిస్తున్నామని అన్నారు.ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్‌లో ప్రారంభం అవుతాయని అన్నారు.కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రో మ్యాగ్నెటిసమ్ వంటి ముఖ్యమైన పాఠ్యాంశాలను కాన్సెప్ట్ పక్కాగా నేర్చుకోవాలని అన్నారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్ లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని విజయవంతం కావాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు.శనివారం, ఆదివారం, సెలవు రోజుల్లో కూడా విద్యార్థులు కొంత సమయం చదువు కోసం వెచ్చించాలని అన్నారు. గ్రాడ్యుయేషన్ మంచి కళాశాలలో చేసేందుకు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం బాగా చదువుకుంటేనే జీవితం బాగా ఉంటుందని అన్నారు. అనంతరం పాఠశాలలో మోటర్ సమస్య ఉందని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకొని రాగా,అవసరమైన 1.5 హెచ్.పి మోటర్ ,ఇతర అవసరాలకు,మరమ్మతులకు, సమస్యలు పరిష్కారానికి నిధులను మంజూరు చేస్తామనితెలిపారు.అనంతరం దివ్యాంగుల ఆర్థిక పునరావాసం క్రింద డి.భాగ్య లక్ష్మి , ఇల్లంతకుంట బ్యాంగిల్ స్టోర్స్ కంగన్ హాల్ పెట్టుకోవడం కోసం రూపాయలు 50,000 నాన్ బ్యాంకింగ్ 100శాతం సబ్సిడీతో కూడిన లోన్ మంజూరు చేసి చెక్ అందచేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్ జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తాసిల్దార్ ,ఎంపీడీవో, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మాజీ ఎంపీపీ పుట్కూరి రమణారెడ్డి , పాశం రాజేందర్ రెడ్డి, అధికార ప్రతినిధి పసుల వెంకటి ఐరెడ్డి మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



### మాదకద్రవ్య రహిత సమాజం
## కోసం పాటుపడాలి

**వేద న్యూస్, ధర్మసాగర్ :**

ధర్మసాగర్ మండలం ఉనికిచెర్లలోని శ్రీనివాస రామానుజన్ కాన్సెప్ట్ స్కూల్లో ప్రహరీ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్య రహిత సమాజ ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా మండల విద్యాధికారి డాక్టర్ రామ్ ధన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన మండల అభివృద్ధి అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ , మాదకద్రవ్యాల సేవనం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజం మొత్తంగా తీవ్రమైన దీర్ఘకాలిక సమస్యల్లో కూరుకుపోతారు. విద్యార్థులు యువత ఈ విషయం పట్ల జాగ్రతతో మసులుకోవాలని అన్నారు. ధర్మసాగర్ సబ్ ఇన్స్పెక్టర్ దిలీప్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల సేవనం వలన శారీరక, మానసిక, ఆర్థిక సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయని ,ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ సంస్థలతో పాటు పౌర సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని అన్నారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్నేహితుల ఒత్తిడితో గంజాయి ,ఆల్కహాల్, హెరాయిన్ ,కుకాయిన్ లాంటి మత్తు పదార్థాల బారిన విద్యార్థులు, యువత పడి తమ బంగారు జీవితాలను నష్టపరచుకుంటున్నారని అన్నారు .అందుకే వీటివల్ల సంభవించే శారీరక ,ఆర్థిక సామాజిక నష్టాలను తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని వక్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజిరెడ్డి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ నివారణ అందరి బాధ్యత



**వేద న్యూస్, జోగులాంబ గద్వాల:**

క్షయ వ్యాధిను నివారణ చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చింతలపేట కాలనీ లో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు మొబైల్ ఎక్స్ రే క్యాంప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి లక్షణాలు ఉన్న వారు గళ్ళ పరీక్ష తప్పకుండా చేయించుకోవాలని ఆయన చెప్పారు. టిబి వచ్చినంత మాత్రాన భయపడవలసిన అవసరం లేదని మందులు వాడితే క్షయవ్యాధి పూర్తిగా తగ్గుతుందని ఆయన స్పష్టం చేశారు. మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే త్వరగా కోలుకొని ఆరోగ్యంగా క్షేమంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ కిరణ్ కుమార్, సూపర్ వైజర్ శేకమ్మ ఏ ఎన్ ఎమ్ స్వర్ణలత, సుజాత, సుగుణ, డి పి సి వెంకటేష్, ఎక్స్ రే టెక్నీషియన్ ఉదయ్, ఆశా కార్యకర్తలు సుభాషిణి జయలక్ష్మి సుజాత కవిత మహేశ్వరి జ్యోతి అస్మా తదితరులు పాల్గొన్నారు.

### వర్షాల నేపథ్యంలో ప్రజలు
## అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్సై గోవర్ధన్**


**వేద న్యూస్, నల్లబెల్లి** -



భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటికి రాకూడదని నల్లబెల్లి ఎస్సై వి గోవర్ధన్ సూచించారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ స్తంభానికి, విద్యుత్తు పరిసరాలకు దూరంగా ఉండాలని అన్నారు. వాహనదారులు రోడ్డుమీద అత్యంత వేగంగా ప్రయాణిం చవద్దని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కల్వర్టుల పరిసర ప్రాంతంలో ఉండవద్దని కోరారు. యువకులు చెరువులు వాగుల్లో చేపలు పట్టేందుకు వెళ్ళావద్దన్నారు. గొర్ల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని చెట్ల ఉండకూడదని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్ళేటప్పుడు కరెంటు మోటార్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.అత్యవసర సమయంలో సాయం కొరకు డయల్ 100 లేదా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712685233 ద్వారా పోలీసులను సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పిచ్చికుక్కల దాడిలో లేగ దూడలు మృతి

**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి:**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలంలోని మెట్ల చిట్టాపూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా పిచ్చి కుక్కలు దాడులు చేయడంతో లేగ దూడలు మృత్యువాత పడుతున్నాయి. పాడి రైతులు పశు వైద్యులకు సమాచారం అందించినప్పటికీ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రాథమిక పశు వైద్య కేంద్రంకు కుక్కలు దాడి చేశాయని తెలిపేందుకు గ్రామస్తులు వెళ్లినప్పటికీ అక్కడ ఎవరూ లేకపోవడంతో వెనుదిరుగుతున్నామని బాధితులు వాపోయారు. డాక్టర్లు ఏరోజు సమయానికి ఉండరని ఫోన్ చేస్తే స్పందించరని బాధితులు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ మెట్ల చిట్టాపూర్ గ్రామానికి చెందిన రైతులం వ్యవసాయం చేసుకుంటూ పాడి పశువులతో జీవనోపాధి పొందుతున్నామని కానీ కొద్ది రోజుల నుండి గ్రామంలో సుమారు 8 పిచ్చి కుక్కలు చేలలో గడ్డి మేస్తున్న సుమారు 10 దూడలపై దాడులు చేస్తూ వాటి ప్రాణాలు హరిస్తున్నాయని గ్రామస్తులన్నారు. పిచ్చికుక్కలు దూడలపై దాడి చేశాయని వెటర్నరీ డాక్టర్లకు సమాచారం అందించగా వారు లేనిపోని సమాధానాలు చెబుతూ దాటవేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1962 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయగా అంబులెన్స్ వచ్చినప్పటికీ అందులో ఎటువంటి మందులు గాని చికిత్సకు ఉపయోగించే ఎటువంటి వస్తూవులు గాని కనీసం పేపర్ పై మందులు రాసేందుకు డాక్టర్ల వద్ద పెన్ను కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వీరిని వైద్యులుగా తీర్చిదిద్దేందుకు రైతుల డబ్బులు ఖర్చుపెడుతలేరా మరి డాక్టర్లకు రైతులపై ఇంత చిన్న చూపెందుకు అని అసహనం వ్యక్తం చేశారు. పై అధికారులు వెంటనే స్పందించి విధులను దుర్వినియోగం చేస్తున్న డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని తమకు తక్షణమే న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నామన్నారు

### ఆచార్య జయశంకర్
## విగ్రహ ఏర్పాటుపై సమావేశం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు పై నిర్వహించిన స్టాట్యూ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో ఆచార్య జయశంకర్ చిత్ర పటం ఉందని, అవకాశం ఉన్నచోట విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గంభీర్ రావు పేట మండలం నమాజ్ చెరువు వద్ద ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ విగ్రహ ఏర్పాటు గురించి చర్చించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చెరువు ఎఫ్.టి.ఎల్ లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేనందున జయశంకర్ విగ్రహం ఏర్పాటు కుదరదని కలెక్టర్ తెలిపారు.స్టాట్యూ కమిటీ సభ్యులు అంగీకారం మేరకు గంభీరావు పేట మండలంలో ఉన్న కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు, దీనికి సంబంధించి అవసరమైన తదుపరి చర్యలను రోడ్లు భవనాల శాఖ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్‌బి ఈ నరసింహ చారి,ఈ.ఈ.పి.ఆర్. సుదర్శన్ రెడ్డి, ఈ.ఈ ఇరిగేషన్ కిషోర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ కేసులకు పరిష్కార మార్గం
## 90 రోజుల మీడియేషన్ డ్రైవ్

**వేద న్యూస్, కరీంనగర్ :**

పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల న్యాయ వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు 90 రోజుల ప్రత్యేక మీడియేషన్ డ్రైవ్ ప్రారంభించినట్లు కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి కే. వెంకటేష్ తెలిపారు. ఈ గురువారం ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (ఎన్ ఎ ఎల్ ఎస్ ఏ,) మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) సంయుక్తంగా చేపట్టిన ఈ డ్రైవ్ "మీడియేషన్ ఫర్ ది నేషన్" పేరిట దేశవ్యాప్తంగా అమలులో ఉన్నట్లు వివరించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వివాహ వివాదాలు, ప్రమాద పరిహార క్లెయిమ్లు, గృహ హింస, చెక్ బౌన్స్ కేసులు, వాణిజ్య వివాదాలు,సర్వీస్, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, వినియోగదారుల కేసులు, రుణ రికవరీ, ఆస్తి విభజన, తొలగింపు, భూ సేకరణ వంటి పలు సివిల్ ఇతర కేసులు సామరస్య పూర్వకంగా పరిష్కారానికి అవకాశం కల్పిస్తాయని తెలిపారు.కేసులు న్యాయస్థానాల్లో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండగా, మధ్యవర్తిత్వం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో సమస్య పరిష్కారం పొందే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి.వెంకటేష్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా సదరు సేవలు పొందవచ్చని, సంబంధిత వ్యక్తులు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు.

## ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బ్రోచర్ ఆవిష్కరణ




**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని గవర్నమెంట్ సిటీ కాలేజ్ (స్వయం ప్రతిపత్తి) ప్రాంగణంలో జరిగే మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బ్రోచర్‌ను ఈ రోజు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. బాల భాస్కర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమం 2025 ఆగస్ట్ 5 నుండి 7 వరకు జరగనున్నది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భాస్కర్ మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం 2020)లో భాగంగా అప్రెంటిస్ షిప్ తో కూడిన డిగ్రీ కోర్సులను విజయవంతంగా అమలు చేయడంలో అధ్యాపకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలు అందించడంలో ఈ కార్యక్రమం ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ శిక్షణలో క్రిస్ప్, బోట్ (దక్షిణ ప్రాంతం), రిటైల్, బిఎఫ్ ఎస్ ఐ, లైఫ్ సైన్సెస్ వంటి సెక్టర్ స్కిల్ కౌన్సిల్స్ నుండి నిపుణులు అధ్యాపకులకు అవగాహన కల్పిస్తారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భవిష్యత్తు ఉద్యోగ నైపుణ్యాలు, బ్లెండెడ్ లెర్నింగ్ వ్యూహాలు, నాట్స్ పోర్టల్‌పై శిక్షణ వంటి కీలక అంశాలను గురించి చర్చించనున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్ర మంలో డా. విప్లవ్ దత్ శుక్లా (వైస్ ప్రిన్సిపల్), డా. నైన వినోదిని, డా. జ్యోతి, ప్రొఫెసర్ వి.శిరిష, డా. రవీంద్ర బాబు, డా. జె. నీరజ, డా. కె. మల్లికార్జున రావు (వాణి జ్య విభాగాధిపతి), డా. ఎస్. ఝాన్సి రాణి, డా. ఇష్ఫత్ ఉన్నీసా తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో రాష్ట్రవ్యా ప్తంగా ఉన్న 40కి పైగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యా పకులు పాల్గొననున్నారని, వారు తమ తమ కళా శాలల్లో అమలు చేస్తున్న ఏఈడీపీకి ఇది మార్గనిర్దేశకంగా నిలుస్తుందన్నారు.




## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

**- ట్రాఫిక్ సిఐ సుజాత**

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ముందస్తు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా స్కూల్ బస్సు డ్రైవర్లకు వరంగల్ ట్రాఫిక్ సిఐ సుజాత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ సిఐ సుజాత మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం తప్పనిసరిగా స్కూల్ బస్సు నడిపే డ్రైవర్లను వారు తాగి ఉన్నారా లేదా అని పరీక్షించాలని ఆమె కోరారు. ఇటీవల కాలంలో అధిక శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రమాదాల నివారణకై స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరిగిందని వరంగల్ ట్రాఫిక్ సిఐ సుజాత తెలిపారు.

## శాశ్వత బ్రిడ్జి నిర్మాణంకు ప్రతిపాదనలు



**వేద న్యూస్, ఎల్లారెడ్డి పేట :**

ఎల్లారెడ్డి పేట నుండి కోరుట్లపేట కు వెళ్లే రహదారి లో గల జంగమోని పట్టే కాలువ వద్ద ఇటీవల కురిసిన వరుస వర్షాల కారణంగా కల్వర్ట్ వద్ద గల రోడ్డు దెబ్బతిన్నది. ఇట్టి విషయం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాగా దీంతో మహేందర్ రెడ్డి పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడి ఇట్టి సమస్య కు పరిష్కారం చూపాలని చెప్పగా పంచాయతీ రాజ్ డి ఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి ప్రస్తుతం రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేస్తామని అధికారులు అన్నారు. శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం కోసం అంచనాలు తయారు చేయాలని కేకే మహేందర్ రెడ్డి చెప్పారని బ్రిడ్జి నిర్మాణం కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని అధికారులు తెలిపారు. డిఈ వెంట పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఏ ఈ శ్రీనివాస్, ఒగ్గు బాలరాజ్, పందిర్ల శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

### మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి

## సామాజిక బాధ్యత




**వేద న్యూస్, వేములవాడ :**

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ అన్నారు. శనివారం వేములవాడ కోర్ట్ ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ తో కలిసి పాల్గొని చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లను పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడం జరుగుతు ందని, స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రతి ఒక్కరూ గడపవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో చెట్లు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్, సీనియర్, జూనియర్ కోర్టు ఏజీపీలు బొడ్డు ప్రశాంత్ కుమార్, పుప్పాల భాను కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, సీనియర్ న్యాయవాదులు గుడిసె సదానందం, పొత్తూరు అనిల్ కుమార్, పర్లపల్లి అంజయ్య న్యాయవాదులు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## పరామర్శ..

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం హైదరాబాదులో పాతూరు భూపాల్ రెడ్డి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన పాతూరు భూపాల్ రెడ్డి తల్లి పాతూరి సుజాత వారం రోజుల క్రితం హైదరాబాదులో వారి స్వగృహంలో అకాల మరణం చెందారు. దీనితో హైదరాబాదులోని వారి ఇంటిలోనే భూపాల్ రెడ్డితో పాటు వారి సోదరులు రామ్ గోపాల్ రెడ్డి రమేష్ రెడ్డిలను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్. రెడ్డి, డైరెక్టర్ మండే శ్రీనివాస్ యాదవ్, రాజన్నపేట మాజీ సర్పంచ్ ముక్క శంకర్, ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి లు ఉన్నారు.

# ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

**వేద న్యూస్, కోనరావుపేట ప్రతినిధి :**

కోనరావుపేట మండలంలోని కొలనూరు గ్రామంలోరైతులకు అవసరమైన ఎరువుల సరఫరా ప్రభుత్వం పూర్తిగా చేపడుతోందని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా ఎం.ఆర్.పి కంటే అధిక ధరలకు విక్రయించి నా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులు హెచ్చరించారు.ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘంలో శనివారం డిసిఒ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి సందీప్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అవస రమైన కాంప్లెక్స్ ఎరువులు తమకు సమీపం లోని సహకార సంఘాల్లో లేదా ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం అవసరమైన పరిమాణం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, నిల్వ చేసుకోవద్దని సూచించారు. వ్యాపారులు ఎంఆ ర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే, రైతులు వెంటనే వ్యవసాయ అధికారులకు సమా చారం ఇవ్వాలని తెలిపారు.

అలాగే, నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు అన్ని పంటలపై ఉపయోగించవచ్చని, ఇవి పంట దిగుబడులు పెంచడమే కాకుండా, నేల, నీరు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయని వివరించారు.



## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆగస్టు 12న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే ఆ సంఘం రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు కోర్టులో పెండింగ్లో ఉన్న ఇంటి స్థలాల విషయమై ప్రభుత్వం న్యాయనిపుణులతో చర్చించి ఇంటి స్థలాలు అందించే ందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న బెదిరింపులు, దాడులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. భవిష్యత్తులో మీడియా అకాడమీ చైర్మన్ పదవిని మాదిగ జర్నలిస్టులకు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించే రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో మాదిగ జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో మాదిగ జర్నలిస్టు ఫోరంకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్, నాయకులు ఒగ్గు సోమయ్య, వసుకుల జయరాజు, వల్దాస్ ప్రవీణ్, మామిడి శ్రవణ్ కుమార్,కనుకు రవి, పల్లెటి నాగార్జున, మీసాల నాగయ్య, దర్శనం శేఖర్, బొల్లికొండ సతీష్, పడిసిరి వెంకట్, నందిపాటి సైదులు,ప్రభు, సాయి, గోపాల్ దాస్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## యువకుడి అరెస్ట్

**వేద న్యూస్, ముస్తాబాద్ :**

ముస్తాబాద్ శివారులో గంజాయి విక్రయానికి యత్నించిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముస్తాబాద్ గ్రామానికి చెందిన మందాటి చందు (22) అనే యువకుడు తన స్నేహితుడు మనోజ్ వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసి, కొంత భాగాన్ని తాగి, మిగిలిన గంజాయిని విక్రయించేందుకు శివారులోకి వెళ్లాడు.ఈ సమాచారంతో స్పందించిన ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్ గణేష్ నేతృత్వంలోని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుండి 102 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అనంతరం చందును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఇతనికి గంజాయి సరఫరా చేసిన స్నేహితుడు మనోజ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

# ఎల్కతుర్తి ఏఎంసీ ఏర్పాటు

**- ఫైనల్ నోటిఫికేషన్ రిలీజ్**

**-వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు**

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసి) నుంచి సపరేట్ ఏరియా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీగా హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వ్యవసాయ, సహకారం, మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్కతుర్తి మండలంలోని 19 గ్రామాలను, భీమదేవరపల్లి మండల పరిధిలోని 22 గ్రామాలను కలిపి సదరు మార్కెట్ కమిటీ పరిధిలోకి తీసుకొస్తున్నట్టు నోటిఫికేషన్ లో పేర్కొన్నారు. హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి నుంచి ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలను తొలగించి ప్రత్యేకంగా ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ నీ ఏర్పాటు చేస్తున్నట్టుగా సదరు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**ఎల్కతుర్తి ఏఎంసి చైర్మన్ గా సుకినె సంతాజీ!**

ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, చింతలపల్లి గ్రామ వాసి సుకినె సంతాజీ పేరు దాదాపుగా ఫైనల్ అయినట్టు తెలుస్తున్నది.

ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అతి త్వరలో రాబోతున్నాయనీ కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఆయన పేరు దాదాపుగా ఖరారు అయిందని, నియామకం లాంఛనమేనని, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయన పేరుని సూచించినట్టుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది. కాగా, సోషల్ మీడియా వేదికగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అనుచరులు ఆయనకు ముందస్తుగానే శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

### పాఠశాల ప్రగతికి ప్రవాసాంధ్రుల

## వితరణ అభినందనీయం




**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

పాఠశాల ప్రగతికి ప్రవాసాంధ్రుల వితరణ అభినందనీయం అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు మిర్యాల సుధాకర్ తెలిపారు.శనివారం సూర్యాపేట కు చెందిన ప్రవాసాంధ్రులు దేవిశెట్టి శ్రీకాంత్, స్వప్న దంపతులు శ్రీ సరస్వతి పాఠశాల యాజమాన్యం ఉపాధ్యక్షులు గుండా రమేష్, పర్వతం శ్రీధర్ల కోరిక మేరకు వారికి సుమారు రూ.10 వేల విలువ గల ఇనుప రాక్స్ ను పాఠశాలకు అందజే శారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాలలో స్థిరపడ్డ మాతృభూమి పై మమకారం తో ముందుకు రావడం అభినంద నియమని అన్నారు.పాఠశాల యాజన్యము గుండా రమేష్,పర్వతం శ్రీధర్ లు మాట్లాడుతూ శ్రీ సరస్వతి పాఠశాలలో చదువుకొని ఎంతో మంది విద్యారులను ప్రయోజకులను చేసిన శ్రీ సరస్వతి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండా లక్ష్మయ్యసీనియర్ సభ్యులు పెండెం చంద్ర శేఖర్, పటేల్ నరసింహారెడ్డి మిర్యాల వెంకటేశ్వర్లు, దేవి రెడ్డి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్‌ఎం నాల్గవ తరగతి ఉద్యోగుల 15600కు వేతనాలు పెంచాలి

**- జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్**

**- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మరియు ఎన్హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ఎం నరసింహ డిమాండ్**

**హైదరాబాద్ జిల్లా, వేదన్యూస్ :**




నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేయుచున్న టువంటి కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు జీవో నెంబర్ 60 ప్రకారం పెంచాలి అని అనేక పోరాటాలు నిర్వహించిన ఫలితంగా కొంతమంది ఉద్యోగులకు జీతాలు పెంచుతూ జీవో ఇచ్చినప్పటికీ నాలుగవ తరగతి సిబ్బందిగా పనిచేయుచున్నటువంటి ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం రూపాయలు 15,600 రావాల్సి ఉన్నప్పటికీ కేవలం 10,400 మాత్రమే ఇచ్చే విధంగా జీవో తీసుకురావడం తీవ్ర అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ మరియు జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా విమర్శించారు. నేడు ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోటీ లోని ఎన్ హెచ్ ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించటం జరిగింది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 1000 మంది నాలుగో తరగతి సిబ్బంది ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కింద పనిచేయుచున్నారని వీరికి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అమలు చేయాలని వారు కోరారు. ఆర్ బి ఎస్ కే డ్రైవర్లకు వెంటనే వారికి రావలసిన అద్దె ఏడు నెలల బకాయిలు చెల్లించని లేని యెడల రాబోవు రోజులలో వాహనాలను నిలబడల చేసి సమయం నిర్వహించినట్లు వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు..ఎన్ హెచ్ ఎం లో అధికారులు ఈ సంస్థలో పనిచేయుచున్నటువంటి కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఇందులో కొంత మందికి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జీతాలు చెల్లిస్తూ కింది స్థాయికి ఉద్యోగుల మాత్రం వారి పొట్ట కొడుతూ శ్రమదోపిడికి గురిచేయుచున్నారని వారు విమర్శించారు. అనంతరం సమర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని చీఫ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పద్మజాకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, ఎన్ హెచ్ ఎం ఆల్ క్యాడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జనగాం జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు వెన్న మహేష్, ఆర్‌బిఎస్ కే డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు టి. రాజు గౌడ్ ప్రధాన కార్యదర్శి రమేష్, గణేష్, పద్మ, బాలకృష్ణ, సరస్వతి, చిరంజీవి శ్రీధర్ అజ్మీర్ విజయ నాయక్ బండి రాజేష్, సాగర్ మరియు తదితరులు పాల్గొన్నారు...

వేద న్యూస్

ఆదివారం జులై 27, 2025

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**కరీంనగర్ జిల్లా, వేదన్యూస్ :**

అరులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార శాఖ ,కరీంనగర్ జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు శనివారం హైదారాబాద్ లోని సచివాలయంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తో కలిసి సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, సిపిఐ చిగురుమామిడి మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి,మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ లు మంత్రికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించడం సంతోషకరమైనప్పటికీ, చిగురుమామిడి మం డలంలో అనేకమంది అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఓసి కులాలకు చెందిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, మండలంలో అనేకమందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇల్లు నిర్మించుకోవడానికి సొంత స్థలాలు ఉండి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారు



కావడంతో ఇండ్లు నిర్మించుకోలేని దుస్థితిలో ఉన్నారని, ప్రభుత్వం అసలైన అర్హులను గుర్తించి మరిన్ని ఇండ్లు మంజూరు చేయాలని చాడ వెంకటరెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకవెళ్లారు. అసలైన అర్హులు గుడిసెల్లో నివాసముండే వారికి మంజూరు చేస్తున్నామని అలాంటి వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తెస్తే మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# ఆలోచనే ఆయుధం

**మొదటి పేజీ తరువాయి**

నేపథ్యం లేని జాతి పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిదని వివరించారు. తెలంగాణ జాతికి అద్భుతమైన సాంస్కృతిక నేపథ్యం ఉందని తెలిపిన ఎమ్మెల్సీ కవిత దాన్ని పరిరక్షించడమే మన ఆలోచనగా తెలంగాణ జాగృతి పని చేస్తూ వచ్చిందని స్పష్టం చేశారు. గత 19 ఏళ్లలో మన భాష, యాస, కట్టు, బొట్టు, బతుకమ్మ, బోనం వంటి వాటి గురించి కొట్లాడిందని, తెలంగాణ ఉద్యమకాలంలో యాసను అవహేళన చేసిన ఒక వ్యక్తికి నంది అవార్డును ఇవ్వాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి అని, తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న ఆంధ్రా సినిమాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చిన ఏకైక సంస్థ తెలంగాణ జాగృతి అని వివరించారు. నమ్మిన సిద్దాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా సరై, ఎంత పెద్ద మాద్యమమైనా ఎదురొడ్డి నిలిచిన సంస్థ తెలంగాణ జాగృతి అని తేల్చిచెప్పారు. తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం కొట్లాడాము. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పనిచేశామని, యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తెలంగాణకు నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరుకోబోదని, తెలంగాణకు నష్టం చేసే బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ జాగృతి ఆపి తీరుతుందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.



### కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను

# సందర్శించిన సీపీ

**వేద న్యూస్, కరీంనగర్ :**

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ,వర్షాల కారణంగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కాలువలు ఉప్పొంగి రోడ్లపైకి వర్షపు నీరు చేరి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా రోడ్లపై పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే ట్రాఫిక్ సిబ్బంది ఆ ప్రదేశానికి చేరుకుని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్, కమిషనరేట్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ఓ . వెంకటేష్, కమాండ్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్లు అందజేత



**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి నూతన హెల్మెట్లను అందజేస్తూ, శనివారం నాడు ప్రత్యేక కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ పాల్గొని, ట్రాఫిక్ సిబ్బందికి స్వయంగా నూతన హెల్మెట్లను అందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లా డుతూ"సిబ్బంది భద్రత కాపాడడమే కాదు, వారు విధుల్లో మరింత చురుకుగా, సమర్థ వంతంగా పనిచేయగలిగేలా అవసరమైన సదుపాయాలు, ఎక్విప్మెంట్ కల్పించడం ప్రధాన బాధ్యత అన్నారు. హెల్మెట్ లాంటి రక్షణ కవచాలు ట్రాఫిక్ సిబ్బం దికి వారి విధుల్లో భద్రతను కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్, ఉన్నతాధికా రులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు

**వేదన్యూస్, వేములవాడప్రతినిధి :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వాక్యాలను నిరసిస్తూ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు న్యాత నవీన్ నేతృత్వంలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో శనివారం అయిన ఫిర్యాదు చేశారు. మీడియా సామాజిక మద్యమాల్లో ఒక అత్యున్నతమైనటువంటి స్థాయిలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని టార్గెట్ చేస్తూ అసభ్యకరమైన రీతిలో ముఖ్యమంత్రి స్థాయిని అగౌరపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలును తీవ్రంగా ఖండిస్తున్నామని న్యాత నవీన్ ఫైర్ అయ్యారు. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజలలో అపహాలు ద్వేషాన్ని రికెత్తించే విధంగా ఉన్నాయని ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే విధంగా ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉండి కౌశిక్ రెడ్డి దిగజారుడుతనంతో మాట్లాడిన వ్యాఖ్యాలను పరిగణలోకి తీసుకొని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ కు వారు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్ల శ్రీనివాస్, నక్క సాయి, గాసికంటి అశోక్, సందేల శశి కుమార్, షేక్ ఇర్ఫాన్, కాసర్ల భాస్కర్, ఎండి షహీద్ పాష , మల్లారం రాజేందర్, మ్యాదరి జాన్సన్, అక్కి సునీల్, పసుల నరేష్, మల్యాల ఉదయ్, దయ్యాల జాను, పసుల చందు ,సురుగు జీవన్ ,తదితరులు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డికి అండగా బీఆర్ఎస్ శ్రేణులు

**కొండాపూర్, వేదన్యూస్**

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు దాడి చేసేందుకు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో కొండాపూర్‌లోని ఆయన ఇంటికి భారీసంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చారు. కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, రంగారావు, రవియాదవ్, వాలా హరీశ్, మల్లారెడ్డి, రోజాదేవి, తిరుమలేశ్, మల్లేశ్‌తోపాటు కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విధానాలను వ్యతిరే కిస్తున్న కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్, అనుబంధ సంస్థలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నాయని



బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ప్రశిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు, బెదిరింపులకు పాల్పడిన భయపడేది లేదని స్పష్టంచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై ఎన్నడూ దాడులు చేయలేదని గుర్తుచేశారు. రేవంత్ సర్కార్ మాత్రం కొత్త పోకడలకు పోతూ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నదని విమర్శించారు.

# ఉచితాలు సముచితమేనా!

**మొదటి పేజీ తరువాయి**

ఉత్పత్తి మార్గాలు కల్పించాలి. ఆత్మగౌరవంతో జీవించే మార్గాలు చూపాలి –అదే నిజమైన సంక్షేమం. సమర్థ పాలన అంటే.. ప్రజలకు అవకాశాలు కల్పించడం, వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆదాయాన్ని పెంచే మార్గాలను చూపించడం, అభివృద్ధికి సరైన దారిని నిర్ణయించడం

**ప్రజలు ఆలోచించాలి**

"ఈ ఉచితాల వెనుక డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది?".భవిష్యత్తు తరాలపై అప్పుల భారం పెరుగుతుంది."ఉచితాల మత్తుతో నీ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నావా?". ఓటు నీ హక్కు మాత్రమే కాదు అది దేశ భవిష్యత్తుకు నిర్ణయించేది. ఉచితాల ఊబిలో సమాజాభివృద్ధి తిరోగమనం అవుతుంది. ఉద్యోగాలు లేని యువత

**గిట్టుబాటు ధర లేని రైతులు**

నిధుల లేమితో ప్రభుత్వాలు సతమతమవుతాయి. పేద,మధ్య తరగతి వర్గాలకు ఉచిత పథకాలు కొంత వరకు ఆసరాగా నిలుస్తాయి. కానీ అవి ఎంత వరకు వారికి చేరుతున్నాయి అనేది ముఖ్యం.. అలాగే వారిని అభివృద్ధి దిశగా నడిపించే దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆచరణలు చేయడం చాలా అవసరం. ప్రజలు చూడాల్సింది సంక్షేమం, అభివృద్ధి, ఉచిత పథకాల మాయాజాలలు కాదు..రేపటి తరాల భవిష్యత్తు బాగుండాలంటే ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించాలి.

# స్కాంపై చర్చకు సిద్ధమా?

**హైదరాబాద్, వేదన్యూస్ :**

'దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో దిక్కుమాలిన కుమ్మక్కు రాజకీయం నడుస్తున్నది.. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బావమరిదికి రూ. 1137 కోట్ల అమృత్ కాంట్రాక్ట్ ఇస్తే, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ.1600 కోట్ల రోడ్డు కాంట్రాక్ట్‌ను కట్టబెట్టిం ది.. ఈ అక్రమ కాంట్రాక్టులే రెండు జాతీయ పార్టీల దిగజారుడు తనానికి నిదర్శనం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్, సీఎం రమేశ్‌ల బాగోతం బయటపెట్టడంతో కుడితిలో పడిన ఎలుకలా ఇద్దరూ గిలగిలా కొట్టు



కుంటున్నారని శనివారం ఎక్స్ వేదికగా విరుచుకు పడ్డారు. హెచ్‌సీయూ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు దోచుకున్న తప్పుడు పనికి సహకరించినందుకు ఒక రోడ్డును సృష్టించారని హాట్ కామెంట్స్ చేశారు. సీఎం రమేశ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసివస్తే హెచ్‌సీయూ రూ. 10 వేల కోట్ల కుంభకోణం, రూ.1660 కోట్ల రోడ్డు కాంట్రాక్టుపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. 'నేను ఆనాడు చెప్పి ంది ఈనాడు రుజువైంది.. అటెన్షన్ డైవర్షన్ కోసం పనికి రాని కథలు చెప్తున్నరు.. రూల్స్ బ్రేక్ చేయడం.. అనుకున్న వాళ్లకు అడ్డదారిలో కాం ట్రాక్టు అప్పగించడం నీ దోస్త్ రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య..నీ దోస్త్ రూ.10 వేల కోట్లు కొల్లగొట్టేందుకు సహకరించినందుకు నీకు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ రూ.1600 కోట్ల కాంట్రాక్ట్ అని తేటతెల్లమైంది' అంటూ నిప్పులు చెరిగారు. ఈ కుంభ కోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లిం చేందుకే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమనే పనికిరాని, పసలేని చెత్త అంశాన్ని తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. 'తెలంగాణ ప్రజల కోసం పుట్టిన పార్టీ.. రాష్ట్ర సాధన కోసం పోరాడిన పార్టీ..అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపిన పార్టీ.. ఏనాడూ ఏ పార్టీలో నూ విలీనమయ్యే ప్రసక్తే లేదని తెలంగాణ ప్రజలకు తెలుసు' అని స్పష్టంచేశారు. ఇరకాటంలో పడిన ప్రతిసారీ ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ అక్కరకురాని చెత్త విషయాన్ని తెరపైకి తెచ్చి తెలంగాణ ప్రజానీకాన్ని గందరగోళ పరచాలని చూస్తున్నా యని మండిపడ్డారు. దమ్ముంటే రేవంత్‌రెడ్డి..రమేశ్ ఇద్దరూ కలిసి చర్చకు రావాలని సవాల్ విసిరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073